RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:59 | ఫిబ్రవరి 07, 2026 | వెల: రూ.3-00



# సమస్యల తిష్ట!
# మైకుల మోత!!

ప్రచారం సరే.. మేనిఫెస్టో ఎక్కడంటూ
**జనం ప్రశ్న**




### ప్రధాన పార్టీల తీరుపై ప్రజల అసహనం

- పట్టణాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- అయినా గెలిపించాలంటూ గల్లీల్లో ప్రచారం
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు.. నిరుద్యోగంపై ప్రశ్నిస్తున్న యువత
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనపైనా ఆగ్రహం
- స్వతంత్ర అభ్యర్థులవైపు ఓటర్ల ఆసక్తి
- ఎవరు గెలిచినా అభివృద్ధిపై దృష్టి సారించాలంటూ సూచన

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేడి రాజుకుంది.. గల్లీ గల్లీలో మైకుల మోత హోరెత్తుతోంది. గెలుపు గుర్రాలెవరో తేల్చుకునేందుకు ప్రధాన పార్టీలు వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. అయితే, ఓట్ల వేటలో ఉన్న అభ్యర్థులకు సామాన్య జనం మాత్రం 'ప్రచారం సరే.. మేనిఫెస్టో ఏది?' అంటూ ప్రశ్నిస్తున్నారు. స్పష్టమైన హామీలు లేకుండా, సమస్యలకు పరిష్కార మార్గాలు చూపకుండా కేవలం మాయమాటలతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలపై రాష్ట్రవ్యాప్తంగా విస్మయం వ్యక్తమవుతోంది. అటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై కోపం, ఇటు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో జాప్యంపై అసహనం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా.. పట్టించుకోని పార్టీల తీరుతో విసిగిపోయిన ఓటర్లు ఈసారి ఇండిపెండెంట్ అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్లు క్షేత్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, అడ్రస్ లేని హామీలు, అమలు కాని గాలిమాటల మధ్య ఓటర్లు ఎవరికి పట్టం కడుతారో..?

2లో

అంతర్జాతీయ స్థాయి
## విద్యే లక్ష్యం

- తెలంగాణ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి
- రూ.600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన
- బర్దిపూర్లో ప్రజాపాలన.. ప్రగతి బాట బహిరంగ సభ

2లో



## రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడొద్దు

- ప్రజా సమస్యలపైనే సమరం చేయాలి
- కాంగ్రెస్ వైఫల్యాలు, హామీల మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



సౌమ్య కుటుంబానికి
## రూ. కోటి పరిహారం

- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వ అండ
- బర్దిపూర్ సభ వేదికగా చెక్కు అందజేత

2లో

ఎన్నికల ప్రచారానికి
## పవన్ వెనుకడుగు

- అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు సమాచారం
- ఇటీవల తెలంగాణపై జనసేన అధినేత వ్యాఖ్యలపై బీజేపీలో అసంతృప్తి




2లో

సిరిసిల్లలో అధికార పార్టీకి
# అగ్ని పరీక్ష!

**కేటీఆర్ కోటను 'హస్తం' బద్దలు కొట్టేనా?**

### కష్టమే అంటున్న రాజకీయ వర్గాలు

- స్థానికంగా బలహీనంగా కనిపిస్తున్న కాంగ్రెస్
- సిట్టింగ్ కౌన్సిలర్లతో బీఆర్ఎస్ పట్టు నిలుపుకుంటుందా?
- చివరి నిముషంలో కాంగ్రెస్ అనుకూలంగా మార్చుకుంటుందా?
- ప్రతిష్టాత్మకంగా సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు




వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల కేవలం ఒక మున్సిపాలిటీ కాదు.. అది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోట. ఇప్పుడు ఆ కోట గోడలను బద్దలు కొట్టి, గులాబీ జెండా స్థానంలో హస్తం జెండా ఎగరేయాలని అధికార కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్రం చూపు అంతా ఇప్పుడు సిరిసిల్ల వైపే మళ్లింది. ఒకవైపు తమ పట్టును నిరూపించుకోవాలని కేటీఆర్ సర్వశక్తులు ఒడ్డుతుంటే, మరోవైపు అధికార బలంతో ఈ ప్రతిష్టాత్మక పోరులో విజయం సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి సేన పావులు కదుపుతోంది. అటు పదేళ్ల అభివృద్ధి మంత్రం.. ఇటు ఆరు గ్యారెంటీలతో సాగుతున్న ఈ పోరులో ఓటరు తీర్పు ఎటువైపు? క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ చివరి నిమిషంలో మ్యాజిక్ చేయగలదా? సిట్టింగ్ కౌన్సిలర్ల బలంతో బీఆర్ఎస్ తన సామ్రాజ్యాన్ని కాపాడుకోగలదా? సిరిసిల్ల మున్సిపల్ పోరుపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం

2లో

## అంతర్జాతీయ స్థాయి విద్యే లక్ష్యం..

- తెలంగాణ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి
- రూ.600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన
- బర్దిపూర్లో ప్రజాపాలన.. ప్రగతి బాట బహిరంగ సభ



**వేద న్యూస్, నిజామాబాద్**

పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా వ్యవసాయం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. రైతుల కృషి వల్ల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఇందూరు జిల్లా మహిళా సమాఖ్యకు చెందిన 1,614 స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును సీఎం అందజేశారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీలో ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్లు, ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం, సైన్స్ ల్యాబ్‌ల ప్రారంభం, రోడ్ల విస్తరణ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా అభివృద్ధికి నూటికి నూరు శాతం కృషి చేస్తానని సీఎం స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడొద్దు

- ప్రజా సమస్యలపైనే సమరం చేయాలి
- కాంగ్రెస్ వైఫల్యాలు, హామీల మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**వేద న్యూస్, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పన్నుతున్న తిట్ల ట్రాప్లో ఎవరూ పడవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మున్సిప ల్ ఎన్నికల వేళ ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో జరిగిన మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికే తిట్ల రాజకీయాన్ని కాంగ్రెస్ తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. తెలంగా ణ సాధన కోసం పద్నాలుగేళ్ల పాటు పోరాడిన నాయకుడు కేసీఆ ర్ అని, రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి ఆయనేనని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ వ్యక్తిత్వంపై దాడి చేయడం తెలంగాణ ఉద్యమ చరిత్రపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చర్చ జరగాల్సింది వార్డుల మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, ప్రజలకు అందాల్సిన పథకాలపైనే కావాలని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎరువుల కోసం క్యూల లో నిలుస్తున్న రైతుల కష్టాలు, రైతు భరోసా ఆలస్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగుతున్న విద్యార్థుల పరిస్థితి, గురుకులాల్లోని లోపాలు, ఉద్యోగులు, పెన్షనర్ల ఇబ్బందులపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. అలాగే సింగరేణి స్కామ్, విద్యుత్ కుంభకోణాలు, నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల తీర్పే కేసీఆర్‌కు ఇచ్చే నిజమైన గౌరవమని, పదేళ్ల అభివృద్ధి తర్వాత ఈ రెండేళ్ల పాలనలో జరిగిన దుర్గతిని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నలతో నిలదీసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# సిరిసిల్లలో అధికార పార్టీకి అగ్నిపరీక్ష!

## కేటీఆర్ కోటను 'హస్తం' బద్దలు కొట్టేనా?



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికలు నిజమైన అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలనే లక్ష్యంతో అధికార పార్టీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు తమ సంప్రదాయ బలమైన నియోజకవర్గంలో పట్టును నిలుపుకోవాలని బీఆర్ఎస్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ బలంగా కనిపిస్తుండగా, అధికార పార్టీ కాంగ్రెస్ మాత్రం స్థానికంగా బలహీనంగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల స్పందనకు సూచికగా మారనున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఈ ఎన్నికలను అన్ని పార్టీలు అత్యంత సీరియస్గా తీసుకున్నాయి

### కష్టమే అంటున్న రాజకీయ వర్గాలు

- స్థానికంగా బలహీనంగా కనిపిస్తున్న కాంగ్రెస్
- సిట్టింగ్ కౌన్సిలర్లతో బీఆర్ఎస్ నిలుపుకుంటుందా?
- చివరి నిముషంలో కాంగ్రెస్ అనుకూలంగా మార్చుకుంటుందా?
- ప్రతిష్ఠాత్మకంగా సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు

### కాంగ్రెస్ అవకాశాలు ఎంతవరకు?

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్కు రాజకీయంగా ప్రతిష్టాత్మకంగా మారాయి. కేటీఆర్ ఇలాకాలో విజయం సాధించి తమ బలాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ నేతలు పట్టుదలతో ఉన్నారు. అధికారంలో ఉన్నామన్న ప్రయోజనాన్ని వినియోగించుకుంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రధాన అస్త్రాలుగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. గత ఎన్నికల్లో కనీస ప్రభావం చూపలేకపోయిన కాంగ్రెస్, ఈసారి స్థానిక బీఆర్ఎస్ నాయకులపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలన్నది కాంగ్రెస్ వ్యూహం. అయితే స్థానికంగా కాంగ్రెస్కు సంస్థాగత బలం కొరవడిందన్న విమర్శలు ఉన్నాయి. క్యాడర్ లోపం, నాయకత్వ సమన్వయం లేకపోవడం వంటి అంశాలు పార్టీకి పెద్ద సవాలుగా మారాయి. టికెట్ల కేటాయింపు నుంచి ప్రచార వ్యూహం వరకు ఐక్యత లోపించడంతో క్యాడర్లో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితి ప్రత్యర్థి బీఆర్ఎస్కు కలిసి వచ్చే అంశంగా మారింది.

### కేటీఆర్ పట్టు నిలుపుకుంటారా?

మరోవైపు సిరిసిల్లపై తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. గతంలో మున్సిపాలిటీపై సంపూర్ణ పట్టు సాధించిన బీఆర్ఎస్, ఈసారి కూడా అదే స్థాయిలో ఫలితాలు రాబట్టాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. కేటీఆర్ వ్యక్తిగత ఇమేజ్ స్థానికంగా బీఆర్ఎస్కు ప్రధాన బలంగా మారింది. పార్టీ క్యాడర్ క్రమబద్ధంగా పనిచేయడం, స్పష్టమైన ప్రచార వ్యూహం అమలు కావడం బీఆర్ఎస్కు కలిసొస్తోంది. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మున్సిపల్ పాలనలో సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కేటీఆర్ స్వయంగా ప్రచారంపై దృష్టి పెట్టడం కూడా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం స్థానికంగానే కాకుండా రాష్ట్ర రాజకీయాలపైనా ప్రభావం చూపే అవకాశముంది. పాలనపరంగా సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా గట్టిగా పోటీ ఇస్తున్న నేపథ్యంలో, ఈ ఎన్నికలు రెండు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి.

### చివరి నిమిషంలో పరిస్థితి మారేనా?

ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో బీఆర్ఎస్ అనుకూల వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, అధికార పార్టీగా కాంగ్రెస్ చివరి నిమిషంలో పరిస్థితిని మార్చగలదా అన్నది ఆసక్తికరంగా మారింది. అంతర్గత విభేదాలను కాంగ్రెస్ ఎలా అధిగమిస్తుందన్నది కీలకంగా మారనుంది. బీఆర్ఎస్ అభివృద్ధి పనులు, కేటీఆర్ వ్యక్తిగత ప్రభావం ఎంతవరకు ఓటర్లను ఆకట్టుకుంటాయన్నదే తుది ఫలితాన్ని నిర్ణయించనుంది. అదే సమయంలో అధికార పార్టీగా కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లే వ్యూహాలు ఎంతవరకు ఫలిస్తాయన్నది కూడా కీలకం. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్కు ఆత్మపరిశీలనకు దారి తీసే ఎన్నికగా మారవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్కు ఈ ఎన్నికలు తమ బలాన్ని మరోసారి నిరూపించుకునే అవకాశంగా మారాయి. ఫలితాలు ఎలా వచ్చినా రాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతాలు ఇవ్వడం మాత్రం ఖాయమని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సమస్యల తిష్ట.. మైకుల మోత!!

### ప్రచారం సరే.. మేనిఫెస్టో ఎక్కడంటూ జనం ప్రశ్న
### ప్రధాన పార్టీల తీరుపై ప్రజల అసహనం


- పట్టణాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- అయినా గెలిపించాలంటూ గల్లీల్లో ప్రచారం
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు.. నిరుద్యోగంపై ప్రశ్నిస్తున్న యువత
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనపైనా ఆగ్రహం
- స్వతంత్ర అభ్యర్థులవైపు ఓటర్ల ఆసక్తి
- ఎవరు గెలిచినా అభివృద్ధిపై దృష్టి సారించాలంటూ సూచన

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది.. ప్రచారం హోరెత్తుతోంది.. కానీ అసలు సిసలైన ప్రజా మేనిఫెస్టో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఓట్ల కోసం గల్లీగల్లీ తిరుగుతున్న ప్రధాన పార్టీల నేతలకు సామాన్య జనం నుంచి ప్రచారం సరే.. మేనిఫెస్టో ఏది? అనే ప్రశ్న ఎదురవుతోంది. స్పష్టమైన హామీలు లేకుండా, అడ్రస్ లేని మాటలతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 2023 సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై క్షేత్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రైతు సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం వేగం పెంచకపోవడం అధికార పార్టీకి మైనస్‌గా మారుతోంది. మరోవైపు, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదు.

### ఎవరి వ్యూహం వారిదే..

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి అనేక చోట్ల చుక్కెదురైంది. ప్రజల వ్యతిరేకత ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. ఇదే ధోరణి మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అయితే కాంగ్రెస్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా, కేంద్రంలో అధికారం ఉన్నప్పటికీ తెలంగాణ గడ్డపై బీజేపీ తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడాల్సిన దుస్థితి నెలకొంది.




### ఎక్కడి సమస్యలు అక్కడే..

ప్రధాన పార్టీలు మేనిఫెస్టో విడుదల చేయకుండా కేవలం రికార్డింగ్‌లు, హోర్డింగ్‌లకే పరిమితం కావడంపై పట్టణ ఓటర్లు మండిపడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బైపాస్ రోడ్ల నిర్మాణం, తాగునీటి ఎద్దడి, మున్సిపల్ పార్కుల అభివృద్ధి వంటి సమస్యలు దశాబ్దాలుగా అలాగే ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరు అందించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

### స్వతంత్ర అభ్యర్థులపై ఆసక్తి

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల వైఖరితో విసిగిపోయిన ఓటర్లు ఈసారి ఇండిపెండెంట్ అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలుతోంది. రాజకీయ పార్టీల గుర్తుల కంటే, స్థానికంగా అందుబాటులో ఉండి సమస్యల కోసం పోరాడే వ్యక్తులకు పట్టం కట్టాలని ఓటర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యక్తిగత ఇమేజ్‌తో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

### ఓటర్లు ఎటువైపో?

స్పష్టమైన మేనిఫెస్టో లేకుండా, మాయ మాటలతో వస్తున్న ప్రధాన పార్టీలను ఓడించి.. మార్పు కోరుకుంటున్న స్వతంత్రులను గెలిపించేందుకు ఉమ్మడి జిల్లాల ఓటర్లు ఒక వేదికగా ఏర్పడుతున్నారు. ఫలితాలు వెలువడే వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## పార్టీ మారిన వారికి ఓట్లతోనే బుద్ధి చెప్పాలి: జీవన్ రెడ్డి

**వేద న్యూస్, జగిత్యాల**

జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని వ్యాఖ్యానించారని ఆరోపించిన జీవన్ రెడ్డి, తాను మాత్రం ప్రజాస్వామ్య పద్ధతిలో ఓట్లతోనే రాజకీయ సమాధానం ఇవ్వాలనుకుంటున్నానని స్పష్టం చేశారు. తన గొంతును నొక్కాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, తనను అణిచివేయాలంటే ముందుగా భుజాల్లాంటి తన కార్యకర్తలను దాటివెళ్లాల్సిందేనని సవాల్ విసిరారు. కార్యకర్తలే తన నిజమైన బలమని, వారి అండతోనే తాను రాజకీయంగా నిలబడగలుగుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన జీవన్ రెడ్డి, తన జీవితంలో తీవ్ర వేదన మిగిల్చేలా తనపై రాజకీయ దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదన్నారు.

## సౌమ్య కుటుంబానికి రూ. కోటి పరిహారం

- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు ప్రభుత్వ అండ
- బర్దిపూర్ సభ వేదికగా చెక్కు అందజేత



**వేద న్యూస్, నిజామాబాద్**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.1 కోటి పరిహారాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ చెక్కును సౌమ్య తల్లి సహా కుటుంబ సభ్యులకు సీఎం స్వయంగా అందించారు. 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభ వేదికగా పరిహార చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజా సేవలో సౌమ్య చేసిన త్యాగం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ, మద్దతు కొనసాగుతుందని సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారానికి పవన్ కళ్యాణ్ వెనకడుగు

- అనివార్య కారణాలతో ప్రచారం రద్దు
- జనసేనాని వ్యాఖ్యలపై బీజేపీలో అసంతృప్తి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సిన కార్యక్రమాన్ని జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రద్దు చేసుకున్నట్లు సమాచారం. అనివార్య కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన వర్గాలు తెలిపాయి. ఇటీవల పవన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయంగా వివాదాస్పదంగా మారడంతో, తెలంగాణలో జనసేన భాగస్వామ్యం బీజేపీకి లాభం కంటే నష్టమే కలిగించే అవకాశముందన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ సమీకరణాలకు ఇబ్బందిగా మారతాయన్న ఆందోళన వ్యక్తమైంది.అదే సమయంలో హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడం కూడా ప్రచారం రద్దుకు కారణంగా చర్చ సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నుంచి వెనక్కి తగ్గినట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు జరుగుతున్నాయి.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 07, 2026

# బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

- ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**వేద న్యూస్, వేములవాడ:**

రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్లు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నియమ నిబంధనలపై స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్‌ఈసీ కరదీపికను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎస్‌ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ రోజున కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిగా ఉన్నాయో లేదో ముందుగా పరిశీలించాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్‌లను సరిచూసుకుని తీసుకెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల అధికారులు మినహా ఇతరులకు అనుమతి లేదని చెప్పారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని వేములవాడలోని సినారే కళామందిర్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి తాగునీరు, భోజనం సహా కనీస వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాధాబాయి, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గోవిందాపూర్ పాఠశాలలో జిల్లా బృందం తనిఖీ

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండలం గోవిందాపూర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా స్థాయి ప్రత్యేక బృందం సందర్శించింది. పాఠశాల పనితీరును అంచనా వేసేందుకు నోడల్ అధికారి వోదెల పార్థసారథి నేతృత్వంలో సభ్యులు తాటిపెల్లి చైతన్య, ఏ. కిరణ్ జిల్లా స్థాయి 'ప్యానల్ ఇన్‌స్పెక్షన్' నిర్వహించారు. ఉదయం ప్రార్థన సమయం నుండి సాయంత్రం పాఠశాల ముగిసే వరకు బృందం సభ్యులు పాఠశాలలోనే ఉండి బోధనాభ్యసన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, లెసన్ ప్లాన్లు, పీరియడ్ ప్లాన్ల తయారీ, బోధనా సామాగ్రి (టిఎల్ఎం) వినియోగం. విద్యార్థుల భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యాలు, ఫార్మాటివ్ (ఎఫ్ ఏ), సమ్మేటివ్ ( ఎస్ ఏ ) పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం. పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్కుల అలైన్‌మెంట్ రికార్డులు, ఇతర అధికారిక రిపోర్టుల తనిఖీ. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వసతుల పరిశీలన. చదువుతో పాటు విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేలా ఆటలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తున్న తీరుపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మటూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు గుగులోతు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల్లో సర్పంచ్ పర్యటన

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



- గ్రామ సమస్యలపై ఆరా

ఇల్లంతకుంట గ్రామంలో శుక్రవారం 11, 12వ వార్డుల్లో స్థానిక సర్పంచ్ ఎం. రాజు వార్డు సభ్యులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, రహదారుల దుస్థితి, పారిశుధ్య లోపాలు వంటి అంశాలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సర్పంచ్ పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం. రాజు మాట్లాడుతూ, ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి దశలవారీగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకుని సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామని అన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలతో కలిసి ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేగుల కార్తీక్, చేరాల వంశీకృష్ణ, మామిడి శ్రీనివాస్, రాకం సుమన్, అంతటి శ్రీకాంత్ గౌడ్, కూనబోయిన రఘు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు కొట్టె వెంకన్న, దేవయ్య, ఎర్రోజు రవి తేజ, దుర్గయ్య, సురేష్, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే పట్టణ అభివృద్ధి



- మంత్రి వివేక్ వెంకటస్వామి
- అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

**వేద న్యూస్, క్యాతనపల్లి:**

క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పట్టణ అభివృద్ధి వేగవంతమవుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 3, 17, 19, 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను కలిసిన మంత్రి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి, క్యాతనపల్లి పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, మందమర్రి పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్, నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, ఒడ్నాల శ్రీనివాస్, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం శుక్రవారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 29, 30, 31, 33, 14, 39, 24, 23 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ప్రతి కుటుంబానికి సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూత్ ఇన్‌చార్జ్‌కు కాంగ్రెస్ సన్మానం

**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**



కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నెరడి గొండ మండల ంలోని ఆడే గజేందర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బూత్ ఇన్‌చార్జ్‌ను బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జల్కే పాండురంగ్ తో పాటు పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల నూతనంగా మండల కన్వీనర్‌గా ఎన్నికైన జల్కే పాండురంగ్‌ను ఆడే గజేందర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల నమ్మకం రోజు రోజుకు పెరుగుతోందని, గ్రామ గ్రామాన పార్టీ బలపడుతోందని తెలిపారు. కార్యకర్తల కష్టం, నాయకుల సమన్వయమే కాంగ్రెస్ విజయానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రజలే పార్టీకి బలం, కార్యకర్తలే ఆయుధమని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ రాజకీయ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతకుముందు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులను కూడా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల స్థాయి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిత్రపక్షాలతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, జూలకంటి రంగారెడ్డి
- మిర్యాలగూడలో పలు వార్డుల్లో ప్రచారం

**వేద న్యూస్, దామరచర్ల:**



గతంలో చేసిన అభివృద్ధి పనులే తమ పనితీరుకు నిదర్శనమని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం యువనేత సిద్ధార్థతో పట్టణంలోని 18, 19, 36, 37, 38, 46, 47వ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పేదల సంక్షేమం మిత్రపక్షాల అభ్యర్థులతోనే సాధ్యమని చెప్పారు. మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మిత్రపక్షాల అభ్యర్థుల ద్వారానే సాధ్యమని అన్నారు. అవినీతి రహిత పాలన కోసం ఓటర్లు మిత్రపక్షాల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించి, అభివృద్ధి వైపు నిలవాలని వారు కోరారు. స్థానికులు, మహిళలు పూలమాలలతో నాయకులకు ఘన స్వాగతం పలికారు.

# నిష్పక్షపాత ఓటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు ముందురోజు, పోలింగ్ రోజున తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరుగుతోందా లేదా, ఎక్కడైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు ఎలా జరుగుతోందన్న అంశాలను సూక్ష్మంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని గమనిస్తూ, విధులను పటిష్టంగా నిర్వర్తించడంతో పాటు పోలింగ్ సిబ్బందితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వెంటనే ఎన్నికల సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ అనంతరం పరిశీలన నివేదికను సంబంధిత పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మల్లిఖార్జున రావు, ట్రైనర్ మహేందర్ రెడ్డి, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



# గోదావరి జలాలకు కాంగ్రెస్ పూజలు హాస్యాస్పదం



**వేద న్యూస్,నల్లబెల్లి :**

దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు లో భాగంగా గోదావరి జలాలకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూజలు చేయడం హాస్యస్పదమని మూడు చక్కల పల్లి సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మండలానికి గోదావరి జలాలు తరలివచ్చే మాన్సింగ్ తండా మెయిన్ కెనాల్ వద్ద గోదావరి జలాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఏడు గ్రామాల తోపాటు వేలాది సాగు భూములను ముంపుకు గురి చేసేందుకు యత్నించి రంగయ్య చెరువు ప్రాజెక్టు నిర్మాణానికి ఒడిగట్టిన సంగతి మండల ప్రజలకు మరచిపోలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామాల రైతుల విన్నపం మేరకు ముంపును నివారించి ప్రాజెక్టును నిర్మాణం చేసి నల్లబెల్లి, ఖానాపూర్ నర్సంపేట, చేన్నారావుపేట మండలాల ను సస్యశ్యామలం చేయడమే ధ్యేయంగా రిటైర్డ్ ఇంజనీర్లతో ప్రత్యేక సర్వేలు చేపట్టి గోదావరి జలాలను తరలించేందుకు ప్రణాళికలు రూపొందించరన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్యను పెద్ది తీసుకెళ్లగా స్పందించిన మాజీ సీఎం కేసీఆర్ తక్షణమే 305 కోట్ల నిధులను విడుదల చేశారన్నారు. ఆ నిధులతో రామప్ప వద్ద పంపు హౌస్ ఏర్పాటు చేసి రెండు పైపులైన్ల ద్వారా రంగయ్య చెరువు, పాకాల, మాదన్నపేట చెరువులకు గోదావరి జలాలతో నింపి బీడు భూములను సైతం సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి దక్కుతుందన్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యేగా గెలిచాక దొంతి మాధవరెడ్డి మరో మారు వేలాది ఎకరాలతో పాటు ఈ ప్రాంత ఏజెన్సీ గ్రామాల ముంపున కు గురి చేసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదికలు పంపిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలిసిందే అన్నారు. లోపాయ కారకంగా ఏజెన్సీ గ్రామాలతో పాటు భూములను ముంపుకు గురిచేందుకు కుట్రలు చేస్తూనే మరో ప్రక్క ప్రజలను నమ్మించేందుకు తమ నేత తీసుకువచ్చిన గోదావరి జలాలపై కపట ప్రేమ వలకబోస్తూ పూజలు చేయడం హాస్యస్పదం గా ఉందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే నల్లబెల్లి మండల రైతాంగం తో పాటు నియోజకవర్గ రైతులకు గోదావరి జలాలు సమృద్ధిగా అందేందుకు నిలిచిపోయిన కుడి, ఎడమ కాలువల పనులను పూర్తిచేస్తూనే ప్రధాన కాలువలకు తూములు ఏర్పాటు చేసి అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఇస్లావత్ రవీందర్, బానోతు వనిత లక్ష్మణ్,అరుణ శ్రీను, విజయ,నరసింహ ప్రేమ్ కుమార్ ,సపావట్ స్వరూప గ్రామ పార్టీ అధ్యక్షులు మూడు మంజీలాల్, ఉపాధ్యక్షులు బోడ సురేష్, బోమ్మిడి శివ రెడ్డి బానోతు బక్షనాయక్,మంగణ నాయక్,నరసింహ చారి,సతీష్,ఉమేష్,ప్రశాంత్ రెడ్డి, సాయిలు, యాకన్న, రమేష్, చిన్నయా, విజయ్, వెంకన్న,హుస్సేన్, వాల్యా, సంగులాల్,రత్తి చంద్రు, యూత్ సభ్యులు బానోతు నితిన్,పవన్, యాకు,బన్నీ, మున్నా,నవీన్, దినేష్, సాయి, రణధీర్, రాంబాబు,నితిన్, సంతోష్,గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండిలో సీఎం కప్ క్రీడా పోటీలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామం వేదికగా చొప్పదండి నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బాలుర విభాగంలో నిర్వహించారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ విభాగాల్లో జరిగిన పోటీల్లో బోయినిపల్లి మండలం కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేత జట్లను, జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఎంపీడీవో, జేసీలు, ఎంఈఓ శ్రవణ్ కుమార్ అభినందించారు. విజయంలో కీలక పాత్ర పోషించిన పీటీలు, పీడీలను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

# ఎన్నికల్లో గెలిస్తే ఫ్రీగా టెంట్ హౌస్,డేకరేషన్ వేస్తా

**వేద న్యూస్,జ్యోతినగర్:**



రామగుండం కార్పొరేషన్ లో జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎన్టీపీసీ ప్రాంతంలోని 32వ డివిజన్ బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి మేడీ భిన్న మహేష్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఆ డివిజన్ లో జరిగే ఎలాంటి కార్యక్ర మాలకై ఉచితంగా టెంట్ హౌస్, డేకరేషన్ వేస్తానని డివిజన్ ప్రజలకు హామీలు ప్రకటించారు. శుక్రవారం ఆ డివిజన్ లో ప్రచారం చేస్తు మాట్లాడారు.. ఇంట్లో ఆడపిల్ల పుడితే 10వేల రూపాయలు ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తానని అన్నారు. ఆడ బిడ్డ పెళ్ళికి రూ 10116 లు అందజేస్తాని పేర్కొన్నారు. డివిజన్ లో కుక్కల బెడదను తొలగిస్తానని హామి ఇచ్చారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని అన్నారు. కరపత్రంలోని హామీలన్ని నేరవేస్తానని ప్రామాణం చేశారు. ఇంటి ఇంటికి తిరుగు ప్రచారం ముమ్మరం చేశారు. డివిజన్ ప్రజలు తన వెంటనే ఉన్నారని ,ప్రజల ఆశ్శీసులతో గెలుస్తాని ధీమ వ్యక్తం చేశారు. యువకునికి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రార్థేయ పడుతున్నారు. కార్యక్రమంలో వీరాలాల్, కమలాకర్,మల్లేష్,తది తరులు పాల్గొన్నారు.

# టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ అండర్ రైల్వే గేటు ప్రాంతం లోని శంభునిపేట, రంగశాయిపేట హోటల్ యజమానులు టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం శంభు నిపేట కార్యసిద్ధి హనుమాన్ దేవాలయలో కందికొండ జనార్దన్ ఆధ్వర్యంలో హోటల్ యజమానులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించి టిఫిన్ సెంటర్స్ యజమానులు అంతా కలిసి ఆసిసియేషన్ ఏర్పాటు చేయాలనీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షడిగా కందికొండ జనార్దన్, ప్రధాన కార్యదర్శి చాపల నాగరాజు, కోశాధికారి కుసుమ రాజసమ్మయ్య, ఉపాధ్యక్షురాలు గోనెల సుజాత, ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వర్ రావు, తోట రాజేందర్, అడప రఘు, ఆర్గనైజర్లుగా ఖాదర్, అనిల్, రమేష్, రాజు, సుమన్, మహేష్, వినయ్, వెంకట్రావు, మహేందర్ ఎన్నికయ్యారు.

# సహకార సంఘం వద్ద రైతుల ఆందోళన

## – యూరియా అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా కొరత ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఒక లారీలో 450 యూరియా బస్తాలను అధికారులు పంపిణీ చేసినప్పటికీ, అవి త్వరగానే అయిపోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. పెద్ద రైతులకు ఓటీపీలు లేకుండానే యూరియా బస్తాలు అందజేస్తున్నారని, మరోవైపు కొంతమంది రైతులు ఓటీపీ నమోదు చేసినప్పటికీ యూరియా ఇవ్వలేదని రైతులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై రైతులు సంఘం సెక్రెటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కొంతమంది రైతులకు ప్రైవేట్ దుకాణాల నుంచి యూరియా బస్తాలు అందించి నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు అవసరమైన మేరకు యూరియా బస్తాలను సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# అనంతారంలో ఉపాధి పనులు ప్రారంభం

## – పేదలకు భరోసా ఉపాధి పథకం – సర్పంచ్ వొల్లాల రజిత



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలోని చొప్పరి వారి గుండ్ల వద్ద సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం పనులను ప్రారంభించి, అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించడమే కాకుండా గ్రామాభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే పనులు నాణ్యతతో పూర్తయ్యేలా కూలీలకు సమయానికి వేతనాలు అందే విధంగా నిరంతర పర్యవేక్షణ చేపడతామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పారదర్శకంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణకు సూచించారు. గ్రామ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, ఉపసర్పంచ్ కదం జయంత్, వార్డు సభ్యులు మల్యాల రాజశేఖర్, చొప్పరి సాయిలు, పీటర్, అక్కేమ్ ఉపేందర్, రమేష్, గోనెపల్లి లావణ్య వెంకటేష్‌తో పాటు గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# కేయూ దూర విద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయ దూర విద్య కేంద్రం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సోమవారం ఆవిష్కరించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు మార్చి 25 వరకు గడువు ఉందని దూర విద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య సురేష్ లాల్ తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు www.sdlceku.co.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీనివాస్ ముంజమ్, డాక్టర్ బ్రహ్మయ్య, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపల్స్ ఆచార్య టి. మనోహర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేంద్ర కట్ల, ఆచార్య ఎం. శ్రీనివాస్, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

# కే హబ్ - టీ హబ్ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ సెషన్




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలు, ఇన్నోవేటర్లుగా విద్యార్థులు ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కేయూహైదరాబాద్ టి.హబ్ సంయుక్తంగా నిర్వహించిన ఓరియెంటేషన్ సెషన్‌లో ఆయన మాట్లాడారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్స్‌కు కే.హబ్, టి.హబ్‌లు సమగ్ర శిక్షణ అందిస్తాయని, ఎంపికైన 100 మంది విద్యార్థులకు ప్రత్యేక సహకారం ఉంటుందని తెలిపారు. వ్యవసాయం, బయోటెక్నాలజీ, ఆటోమేషన్ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. టి.హబ్ ప్రధాన అధికారి రాజేష్ కుమార్ ఎడ్ల మాట్లాడుతూ కే.హబ్‌ను భవిష్యత్తులో టి.హబ్ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ స్టార్టప్ వ్యవస్థాపకులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## – రూ.10వేలు జరిమానా




**వేద న్యూస్, అల్లాదుర్గ్:**

హత్య కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. గడిపేద్దపూర్ గ్రామానికి చెందిన గౌరీగళ్ల యాదయ్య మద్యానికి బానిసై ఉపాధి లేకుండా ఉండేవాడని తెలిపారు. అతని అన్న మొగలయ్య మృతి తర్వాత అన్న కుమారుడు మహేష్ యాదయ్యతో కలిసి నివసిస్తూ ఉండేవాడని, ఇద్దరూ తరచూ మద్యం సేవిస్తూ గొడవపడేవారని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 10న మద్యం సేవించిన అనంతరం ఫోన్ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా, మహేష్ యాదయ్య చేతులు, కళ్లను కట్టేసి కర్రతో దాడి చేయడంతో యాదయ్య మృతి చెందినట్లు వివరించారు. ఈ ఘటనపై అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో సాక్ష్యాలను సమర్థవంతంగా ప్రవేశపెట్టడంతో జిల్లా న్యాయ మూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాస్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించగా, పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థంగా సహకరించి నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# రగుడు చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బి.గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు నగదు, మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు, ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 07, 2026

# లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

**- అంగన్వాడీ ఉద్యోగులు**



**వేద న్యూస్, రుద్రూర్:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగి స్తామని అంగన్వాడీ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ నెల 12న కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొం టామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తారాబాయికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్, యూనియన్ నాయకులు పద్మ, గంగామణి, రూప తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ పూర్తి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**వేద న్యూస్, మంచిర్యాల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె. గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్యలతో కలిసి ఈ ప్రక్రియను నిర్వహించారు. ఒక్కో బృందానికి ఒక పీఓ, ఒక ఏపీఓ, ముగ్గురు ఓపీఓల చొప్పున బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68, చెన్నూరుకు 36, క్యాతనపల్లికి 45, లక్షెట్టిపేటకు 30, మంచిర్యాల నగరపాలక సంస్థకు 265 బృందాలను కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఇందుకోసం సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లో, మంచిర్యాల కార్పొరేషన్‌కు నస్పూర్ ఐడీఓసీ వద్ద ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓటు వినియోగించుకోవచ్చని చెప్పారు. మున్సిపల్ పరిధుల వారీగా ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివితే విజయం ఖాయం

**- జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య**

**- పదో తరగతి విద్యార్థులకు లక్ష్యసాధనపై అవగాహన**



**వేద న్యూస్, కాసిపేట:**

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో చదువు కుంటే విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించగలరని మంచిర్యాల జిల్లా డీఈవో యాదయ్య అన్నారు. కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో కాసిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో యాదయ్య మాట్లాడుతూ సమయపాలన పాటించి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు. మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్ బణావత్ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడిని అధిగమించే మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను సన్మానించి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ సమాఖ్య భవనంతో మహిళా సాధికారతకు బాట

**వేద న్యూస్, వీర్నపల్లి:**

వీర్నపల్లి మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి మరో కీలక ముందడుగు పడిందని గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న తెలిపారు. వీర్నపల్లి గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శుక్రవారం గ్రామ పాలకవర్గ ప్రతినిధులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మించనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు. మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల నరేష్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఎంపిడివో శ్రీలేఖ, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఏపీఓ శ్రీహరి, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



**- సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న**

# భౌతిక శాస్త్రంలో రెండు రోజుల జాతీయ సదస్సు



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రతి నూతన శాస్త్రీయ అప్లికేషన్ మానవ జీవన గమనాన్ని మార్చుతుందని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన అణువులు మరియు పదార్థాలు.. లక్షణాల నిర్ధారణ, అనువర్తనాలు' అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు తొలి రోజు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి డాక్టర్ మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, నూతన పదార్థాల రూపకల్పన పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్థిరమైన, అధిక సామర్థ్య పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. ఇవి ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, వైద్య, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో వినూత్న అప్లికేషన్లకు దోహదపడతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా హానికరమైన పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానుకూల పదార్థాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, సమాజ మనుగడలో శాస్త్ర పరిశోధనల పాత్ర కీలకమని, వ్యాధి నిర్ధారణ నుంచి ప్రపంచ సమస్యల పరిష్కారం వరకు శాస్త్రం కీలకంగా ఉందని తెలిపారు. ఈ సదస్సులో డీన్ ఆచార్య హనుమంతు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల సదస్సుకు సంబంధించిన పరిశోధనా పత్రాల అబ్స్ట్రాక్టులను అతిథులు విడుదల చేశారు.

# మెట్టుగుట్ట జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, మడికొండ:**



వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టలో ఈ ఏడాది నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జాతర గోడపత్రికలను స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో-ఆప్ బ్యాంక్ చైర్మన్ మారినేని రవీంద్ర రావు, కో-ఆప్ చైర్మన్ ఇనగాల వెంకట రామిరెడ్డి కూడా పాల్గొన్నారు. అలాగే ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. సత్యనారాయణ, శివాలయం చైర్మన్ రఘుచందర్, బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, వస్కుల నాగరాజు, బిల్లా రవి, ఎడబోయిన ప్రభాకర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

**- రూ.18,600 నగదు... ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**వేద న్యూస్, కూల్చారం:**

మెదక్ జిల్లా కూల్చారం మండలం పరిధిలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రాంపూర్ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 18,600 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు బోలా శేఖర్, కత శ్రీనివాస్, మస్కరి శ్రీశైలం, గుమ్మడి సురేష్, మ్యాకల యాదగిరిగా పోలీసులు గుర్తించారు. వారిని కూల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి చర్యల వల్ల కుటుంబాలు నష్టపోతున్నాయని, యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# భక్తులకు సాఫీగా దర్శనం కల్పించాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- రాజన్న ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన**



**వేద న్యూస్, వేములవాడ:**

మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు సాఫీగా, ఇబ్బందుల్లేకుండా దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఐపీ దర్శనాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ద్వారం, బారికేడింగ్‌ను పరిశీలించి ఆలయ ఈఈ రాజేష్‌కు పలు సూచనలు చేశారు. క్యూ లైన్లు, తాగునీటి ఏర్పాట్లను పరిశీలిస్తూ, భక్తుల సౌకర్యార్థం మరిన్ని తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణానికి సమీపంలోని ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాద కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళ్యాణకట్టను పరిశీలించి, మొబైల్ టాయిలెట్ల సంఖ్యను పెంచాలని సూచించారు.

**జాతర వైభవంగా నిర్వహించాలి**

మహా శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేసి, జాతరను వైభవంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ స్థలంలో కోడెల టికెట్ కౌంటర్లు, పందిర్లు, శివార్చన స్టేజీ ఏర్పాట్లను పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా, ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధా భాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టుపైనే గీత కార్మికుడి మృతి

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో గీత కార్మికుడి విషాద మృతి చోటుచేసుకుంది. రెక్కాడితే గాని డొక్కాడని ఓ పేద కుటుంబంలో తీరని విషాదం నింపింది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు సాయిలి కిషన్ నిత్యంలాగే శుక్రవారం కల్లు గీయడానికి తాటి చెట్టెక్కాడు. అయితే చెట్టుపైకి వెళ్లిన కొద్ది సేపటికే అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కిషన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఏకైక ఆధారమైన కిషన్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



# ప్రభుత్వ భూముల పరిరక్షణకు వినతి

**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములు, కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ గ్రామ భూ సంరక్షణ కమిటీ అధ్యక్షులు మర్రి రమేష్ ఆధ్వర్యంలో సభ్యులు చందుర్తి తహసీల్దార్‌కు లిఖితపూర్వక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మండల పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని బోడగుట్ట, కొత్త హనుమండ్లు గుడి శివారులో విస్తారమైన ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఈ భూమిని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూ సంరక్షణ కమిటీ సభ్యులు, చందుర్తి గ్రామ ప్రజలు, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



# రోడ్డుపై జేసీబీ పార్కింగ్‌డప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**వేధ న్యూస్,జ్యోతినగర్:**



ఎన్టీపీసీ ప్రాంతం లోని ఆర్ట్ వో ఆఫీస్ వద్ద గల సర్వీస్ రోడ్డుపై జేసీబీ యంత్రాలను అడ్డంగా పార్క్ చేయడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై రెండు జేసీబీలు వరుసగా నిలిపివేయడం వల్ల వాహనాల రాకపోకలు ఆటంకానికి గురవ ుతున్నాయి.ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం పీక్ అవర్ సమయంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.సర్వీస్ రోడ్డును ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినప్పటికీ, భారీ యంత్రాలను ఇష్టానుసారంగా పార్క్ చేయడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి జేసీబీలను తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని కోరుతున్నారు.ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# బీజేపీ ఎన్నికల ప్రచారంలో డాక్టర్ చెన్నమనేని దీప



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 19వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి రేగుల రాధిక సంతోష్ బాబు దంపతులకు మద్దతుగా బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు సతీమణి డాక్టర్ దీప విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను కలిసి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ పథకాల వల్ల సామాన్య ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను ఆమె తెలియజేశారు. అదేవిధంగా గతంలో సంతోష్ బాబు 20వ వార్డు కౌన్సిలర్‌గా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేశారు. వార్డు సమగ్ర అభివృద్ధికి రేగుల రాధిక- సంతోష్ బాబు నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి రేగుల రాధిక సంతోష్ బాబు దంపతులను భారీ మెజారిటీతో గెలిపించాలని డాక్టర్ దీప పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరాలకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన జాబితాలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి స్వీకరిస్తామని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శు క్రవారం సిరిసిల్ల పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే ఫ్లాగ్ మార్చ్ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నామని, చట్ట విరుద్ధంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా అక్రమ మద్యం, నగదు లేదా ఇతర వస్తువుల రవాణా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, శ్రీనివాస్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు శ్రీకాంత్, ఉపేంద్రచారి, రాజు, దిలీప్, రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, వీనితా రెడ్డి, జునైద్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి నాది

- ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

గత పదేళ్ల పాలనలో పేదలకు కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వని గత ప్రభుత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. అభ్యర్థులను గెలిపిస్తే, ఏదులాపురం అభివృద్ధి బాధ్యతను తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మంత్రి విస్తృతంగా రోడ్ షో నిర్వహించారు. రెడ్డిపల్లి నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికలు రాగానే మాయ మాటలతో ప్రజలను మోసం చేయాలని చూస్తారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటోందని తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే 587 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రెండో విడత జాబితాను విడుదల చేస్తామని ప్రకటించారు. మంత్రి పర్యటనకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా, పార్టీ శ్రేణులు నినాదాలతో రోడ్ షోను హోరెత్తించారు. ఆయా వార్డుల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్ర విభాగంలో నూతన ప్రయోగశాలల ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగంలో రూసా ప్రాజెక్ట్ నిధులతో నిర్మించిన నూతన ఆధునిక ప్రయోగశాలలను విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి శుక్రవారం ప్రారం భించారు. రూసా ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లలో మాలిక్యూల్స్, మెటీరియల్స్ లక్షణాల విశ్లేషణ కోసం 12 అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు సెంటర్ ఫర్ మాలిక్యూల్స్ అండ్ మెటీరియల్స్ ఫిజిక్స్ డైరెక్టర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తెలిపారు. ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు సుమారు రూ.1.7 కోట్ల వ్యయం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రయోగశాలలు ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫార్మసీ, లైఫ్ సైన్సెస్ విభాగాల విద్యార్థులు, పరిశోధకులకు ఉపయోగపడనున్నాయని తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో నూతన పదార్థాల పరిశోధన, విశ్లేషణ, వినూత్న అనువర్తనాల అభివృద్ధికి ఈ ల్యాబ్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, డీన్ ఆచార్య జి. హనుమంత్, ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్‌తో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా దుస్తుల పంపిణీ

**వేద న్యూస్, కమలాపూర్:**




హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు హుజరాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గోలి శ్రీనివాస్ ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, విద్యార్థులకు దుస్తులు అందజేసిన గోలి శ్రీనివాస్‌ను అభినందిస్తూ ఆయన దాతృత్వాన్ని కొనియాడారు. అవసరం లేకున్నా సమాజానికి సేవ చేయాలనే మంచి సంకల్పంతో ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నమ్మ, ఉపాధ్యాయులు వీరబ్రహ్మేంద్ర చారి, సుజాత, లక్ష్మణ రెడ్డి, సంజీవ రెడ్డి, అబ్దుల్లా, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళను వేధించిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మహిళను వేధించిన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ కే కృష్ణ తెలిపారు. సుభాష్‌నగర్‌కు చెందిన మహిళ భర్త ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన ఎండి.మజీద్ ఆమెను దురు ద్దేశంతో వెంబడిస్తూ ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులకు గురిచేశాడు. పెద్దలు హెచ్చరించినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. 2021 ఫిబ్రవరి 22న మహిళ పని కోసం వెళ్తుండగా, నిందితుడు ఆమెను అడ్డగించి చేయి పట్టుకుని బెదిరించినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై జి.సుధాకర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టులో ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదనలు వినిపించగా, న్యాయమూర్తి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు.

# బిక్కవాగులోకి నీళ్లు విడుదల చేయాలి

**- బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కో కన్వీనర్ బత్తిని స్వామి**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్ నుంచి అనంతారం పెద్ద చెరువులోకి నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి బిక్కవాగు, రహీంఖాన్‌పేట సింగరాయ చెరువులోకి నీళ్లు చేరేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కో కన్వీనర్ బత్తిని స్వామి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రస్తుతం చెరువులు, బావులు, బోర్లలో భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోయి సాగునీటి కొరత ఏర్పడిందని తెలిపారు. పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తకముందే వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు.

# రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

**వేద న్యూస్, మడికొండ:**



కాజీపేట మండలం 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీ మహిళా కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న రోడ్డు భాగాన్ని కొందరు కబ్జా చేసి అభివృద్ధికి అడ్డుప డుతున్నారని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జాంబవ సంఘం అధ్యక్షుడు వస్కుల ఆనం ద్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు గ్రేటర్ వరంగల్ మున్సి పల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమస్యపై డాక్యుమెంట్లు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన జాబితాలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.i ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభమవుతుందని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# తల్లి ఆరోగ్యమే బిడ్డకు క్షేమం

- పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**వేద న్యూస్, రామడుగు:**



ప్రతి తల్లి సుఖ ప్రసవంతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మ ఇవ్వాలంటే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మోడీ రవీందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్డు తదితర పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, గర్భిణీలు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అప్పుడే ఆరోగ్యవంతమైన తల్లులు, పండంటి బిడ్డలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ మోడీ రవీందర్ మాట్లాడుతూ గ్రామానికి రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రావణ్ కుమార్, డీఎం & హెచ్ఓ వెంకట రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ వాలీబాల్ ఫైనల్‌కు కాసిపేట జట్టు

**వేద న్యూస్, కాసిపేట:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో ఎడిషన్ సీఎం కప్-2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కాసిపేట వాలీబాల్ జట్టు ఫైనల్‌కు చేరి మండలానికి గర్వకారణంగా నిలిచింది. బెల్లంపల్లి పట్టణంలోని గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ప్రారంభమైన పోటీల్లో కాసిపేట జట్టు అద్భుత ప్రదర్శన తో ఫైనల్ బెర్త్ సాధించింది. బలమైన ప్రత్యర్థి జట్లను మట్టికరిపిస్తూ ఫైనల్‌కు చేరడం అభినందనీయమని అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా కాసిపేట జట్టును, జట్టు కోచ్‌లు, మేనేజర్లుగా వ్యవహరిస్తున్న పీఈటీలు, పీడీలను కాసిపేట ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, మండల విద్యాధికారి వెంకటేశ్వర స్వామి అభినందించారు. అలాగే పలువురు సర్పంచులు, కాసిపేట కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ మామిడిపల్లి సాంబమూర్తి తదితరులు జట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఫైనల్‌లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. సీఎం కప్ వంటి పోటీలు గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

# మైనారిటీ గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

- మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా

**వేద న్యూస్, కారేపల్లి:**



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకులాల్లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలను మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా (షేరు) ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో మొత్తం 17 కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గత ఏడాది ప్రవేశ పరీక్షల ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ లో 39 సీట్లు, ఐఐటీల్లో 38 సీట్లు, ఈఏపీసీఈటీలో 1417 సీట్లు కన్వీనర్ కోటాలో ఉచితంగా సాధించారని వివరించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, మైనారిటీ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న మైనారిటీ, నాన్-మైనారిటీ విద్యార్థులు tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14న ఉమ్మడి జిల్లాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000255330 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ఐదేళ్లుగా 'సమాచారం' లేదు!

- ఆర్టీఐ దారఖాస్తులను పట్టించుకోని జగిత్యాల జిల్లా యంత్రాంగం
- కమిషన్ ఆగ్రహం.. డీపీవో కార్యాలయానికి నోటీసులు
- రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఆదేశాలు




**వేద న్యూస్, జగిత్యాల (బుగ్గారం):**

జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కార్యాలయాల్లో గత ఐదేళ్లుగా ఆర్టీఐ దరఖాస్తులకు సమాచారం ఇవ్వని విషయం అధికారికంగా వెలుగులోకి వచ్చింది. 2022 మే 17న అర్జీదారు చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా, సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు. దీంతో ఆయన తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై కమిషన్ జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేసి, 2025 అక్టోబర్ 27న విచారణకు హాజరు కావాలని ఆదేశించినప్పటికీ, అధికారులు హాజరుకాలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సమాచార కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కమిషన్ ఆదేశాల అనంతరం జిల్లా యంత్రాంగం కదిలివచ్చింది. ఈ నెల 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి డీపీవో కార్యాలయానికి నోటీసులు జారీ చేసి, రెండు రోజుల్లో అర్జీదారు కోరిన సమాచారాన్ని అందజేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టాన్ని జిల్లా అధికారులు బేఖాతరు చేస్తున్నారని, వందలాది ఆర్టీఐ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. న్యాయస్థానాలను ఆశ్రయించినప్పుడే అధికారులు స్పందిస్తున్న పరిస్థితి దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారులు స్పందించి, ఆర్టీఐ దరఖాస్తులకు సకాలంలో సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సీఎం సభ అట్టర్ ఫ్లాప్

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ విమర్శించారు. చొప్పదండిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో నిర్వహించిన ఈ సభ ప్రజలను ఆకట్టుకోలేకపోయిందన్నారు. కరీంనగర్‌లో సభ పెట్టే ధైర్యం లేక చొప్పదండిలో నిర్వహించారని సీఎం మీద ఆరోపించారు. ప్రసంగంలో కొత్త అంశాలేవీ లేకపోవడంతో సీఎం మాట్లాడుతుండగానే ప్రజలు వెళ్లిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత రెండేళ్లలో చొప్పదండి నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిధులు గుండుసున్నా అని తెలిపారు. తన హయాంలో ప్రారంభించిన పనులను ఇప్పటికీ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను పెంచుతామని చెప్పి అమలు చేయకపోవడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, చొప్పదండిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌బీజేపీలు కలిసి బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. 70 వేల ఉద్యోగాలపై సీఎం చేసిన వ్యాఖ్యలు మోసపూరితమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి కంటే స్కాములే పెరిగాయని విమర్శించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒగ్గు వైపు జనం మొగ్గు

- 28వ వార్డు ప్రజల ఆశీస్సులు పొందుతున్న రమేశ్
- ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు ప్రజలు అధికార పార్టీ అభ్యర్థి ఒగ్గు రమేశ్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజాశ్రేయస్సుయే ధ్యేయంగా ముందుకు సాగుతున్న అధికార పార్టీ తరఫున ప్రజా ప్రతినిధి వార్డులో ఉంటే.. తమ పనులు చక్కగా చకచకా జరుగుతాయనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేశ్ దూసుకెళ్తున్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ.. గడపగడప ప్రచారం నిర్వహిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారు.

**ప్రజల సంక్షేమమే ప్రధానం**

వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీకి ఓటు వేయడం అవసరమని, అప్పుడే సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతాయని ఈ సందర్భంగా ప్రచారంలో కౌన్సిలర్ అభ్యర్థి రమేష్ ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నా యని, రాబోయే రోజుల్లో తనను గెలిపిస్తే అర్హులైన నిరుపేదలకు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. తనకు ఒక్క



అవకాశం ఇస్తే.. 24/7 కౌన్సిలర్ గా ప్రజలకు అందుబాటులో ఉంటానని, పిలుపు దూరంలోనే ఉంటూ.. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడిస్తున్నారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేశ్ గెలుపు పక్కా అని అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు
- బాధితులు యాదాద్రి జిల్లావాసులు

**వేద న్యూస్, దామరచర్ల:**

పురుగుల మందు తాగి ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దామరచర్ల మండలం రాళ్లవాగుతండా సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న స్థానికులు వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితులు యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం తేర్యాల గ్రామానికి చెందిన సౌమ్య, రాకేష్‌గా గుర్తించారు. ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరించడంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# మొబైల్ రికవరీలో సిరిసిల్ల జిల్లాకు జాతీయ కీర్తి

- 78% రికవరీ రేటుతో దక్షిణాదిలో తొలి స్థానం
- జిల్లా పోలీసుల పనితీరును ప్రశంసించిన రాష్ట్ర డీజీపీ
- సీఈఐఆర్‌తో విశిష్ట విజయం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి విశిష్ట ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం సాధించిన గర్వకారణమైన విజయం. జిల్లాలో పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, సీఈఐఆర్ అప్లికేషన్‌ను సమర్థంగా ఉపయోగించడం ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,286 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందించారు. ఈ పనితీరుతో 78 శాతం రికవరీ రేటు సాధించి దక్షిణ భారతదేశంలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ జిల్లా పోలీసుల పనితీరును అభినందిస్తూ ప్రశంసలు కురిపించారు. మొబైల్ రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయిలో మొదటి స్థానం జిల్లా పోలీసులకు దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ నెల 12న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఐపీఎస్ హాజరై, సీఈఐఆర్ ద్వారా మొబైల్ ఫోన్ రికవరీలో అనుసరించిన ఉత్తమ విధానాలు, కార్యాచరణ వ్యూహాలు, విజయవంతమైన అనుభవాలను వివరించి అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ రికవరీలో ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం, దక్షిణాది రాష్ట్రాలలో తొలి స్థానం సాధించడం తెలంగాణ పోలీసుల నిబద్ధతకు నిదర్శనం. ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవడం, సీఈఐఆర్ వంటి ఆధునిక డిజిటల్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

# బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి రాజన్నల రాజు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఓటరును ఆత్మీయంగా పలకరిస్తూ, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. 8వ వార్డు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మరోసారి బరిలో నిలిచానని, అందరికీ అందుబాటులో ఉంటూ సేవనే ధ్యేయంగా ముందుకు సాగుతానని రాజన్నల రాజు తెలిపారు. ప్రజల అవసరాలకు స్పందిస్తూ పిలుపు దూరంలోనే ఉంటానని హామీ ఇచ్చారు.

# కమలనాథుల జోష్

- 3వవార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి విస్తృత ప్రచారం
- ప్రజల ఆశీస్సులు కోరుతున్న కొలకాని రాజకుమారి రాజు
- జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా రేసులో..





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని బీజేపీ 3వ వార్డు(రామన్నపల్లె) కౌన్సిలర్ అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు జనంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ.. దూసుకెళ్తున్నారు. తాజాగా స్థానిక ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రచారంతో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులు, లీడర్లలో జోష్ నెలకొంది. ఈ నేపథ్యంలో.. మున్సిపల్ ఎన్నికల్లో నెగ్గి.. జమ్మికుంట పురపాలక సంఘం చైర్మన్ పీఠం కైవసం చేసుకుంటామని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాసేవయే లక్ష్యం**

ప్రజాసేవయే తమ లక్ష్యమని బీజేపీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, ఆయన సతీమణి రాజకుమారి ప్రజలకు వెల్లడిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జమ్మికుంట పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించిందని, స్థానిక పార్లమెంటు సభ్యుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో తాము వార్డుతో పాటు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని వారు ప్రజలకు వివరిస్తున్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తమను ఆదరించి.. ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నారు. రామన్నపల్లె గడపగడప తిరుగుతూ.. అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ.. ఓట్లు అభ్యర్థిస్తున్నారు. జనం నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, గెలుపుపై కాషాయ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రజలతో మమేకమై..

- ఆత్మీయంగా ఓట్లు అభ్యర్థిస్తూ..
- బీఆర్ఎస్ 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి విస్తృత ప్రచారం





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19 వ వార్డులో హోరాహోరీ పోరు నెలకొంది. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి జావేద్ జనంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గడపగడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. జన సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా తాను పని చేస్తానని, ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం తాను బరాబర్ బరిగీసి కొట్లాడుతానని ప్రజలకు హామీనిస్తున్నారు.

**వార్డు ప్రజలే కుటుంబ సభ్యులు**

తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే.. 24/7 అందుబాటులో ఉంటానని, చిత్తశుద్ధితో ప్రజాప్రతినిధిగా సేవలందిస్తానని జావేద్ వెల్లడిస్తున్నారు. ప్రచారంలో గులాబీ పార్టీ శ్రేణులు విస్తృతంగా జనంతో మమేకమవుతున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థికి అపూర్వ స్పందన, ఆదరణ లభిస్తోందని తమ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ లీడర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 19వ వార్డు పరిధిలోని ప్రజలే తన కుటుంబ సభ్యులని, వారి కష్ట సుఖాలలో తోడుగా తాను కుటుంబ సభ్యుని వలె ఉంటానని, జనం కోసం పని చేసే నాయకుడిగా, కార్యకర్తగా తాను ఉంటానని కౌన్సిలర్ అభ్యర్థి జావేద్ ప్రజలకు భరోసానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జావేద్ గెలుపుపై పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయం జావేద్‌దే అంటూ ఓటర్లు సైతం భరోసానిస్తున్నారని పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ అంటే అభివృద్ధి

- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ప్రణవ్
- కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం




**వేద న్యూస్, జమ్మికుంట:**

ఎన్నికలు వస్తేనే బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు అభివృద్ధి గుర్తుకు రావడం,ఎన్నికల్లో ఓట్ల కోసం తప్ప అభివృద్ధి చేయాలనే తపన ఆ రెండు పార్టీలకు లేదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రోజున జమ్మికుంట పట్టణంలో 6,7,8,9,10,11,1,2,3,13,14 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి,కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు.ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు,ప్రణవ్ కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.అనంతరం వోడితల ప్రణవ్ మాట్లాడుతూ హుజురాబాద్,జమ్మికుంట పట్టణ ప్రజలు ఈ సారి మార్పును కోరుకుంటున్నారనీ,పదేళ్ల తర్వాత అన్ని వర్గాలకు అందుబాటులో సంక్షేమ పథకాలు అమలు చేశామని ఇది పదేళ్లు ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎందుకు చేయలేదని విమర్శించారు.12 ఏళ్లుగా ఎంపీ గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 12 ఏళ్లలో తీసుకురాని నిధులు ఇప్పుడు తీసుకొస్తా అనడం విడ్డూరంగా ఉందని అన్నారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం ద్వారా వార్డుల అభివృద్ధి జరుగుతుందని,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాలకు 15కోట్లు నిధులు కేటాయించామని,భవిష్యత్ లో రెండు మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తద్వారా ముఖ్యమంత్రి,మంత్రులతో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకువస్తామని తెలిపారు.కౌశిక్ రెడ్డికి లొల్లిళ్లు తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదనీ,గతంలో ఎమ్మెల్సీ గా ఉన్నప్పుడు,ఇప్పుడు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఏ రోజు అభివృద్ధి గురించి ఆలోచించలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల అభ్యర్థులు,పిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి,సాయిని రవి,గుడెపు సారంగపాణి,పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్,సీనియర్ నాయకులు,వార్డ్ కో ఆర్డినేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ‘చేతి’లో చేయి వేసి..

- కౌన్సిలర్ నుంచి పురపాలక పీఠం వరకు..
- భరోసానిస్తున్న ఓటర్లు.. కాంగ్రెస్ శ్రేణుల విస్తృత క్యాంపెయిన్
- 17 వ వార్డులో ప్రచారంలో సుంకరి రమేశ్ దూకుడు





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 17 వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి సుంకరి రమేశ్ ప్రచార పర్వంలో ముందు వరుసలో నిలిచి దూసుకెళు_న్నారు. కౌన్సిలర్ గా ఆయన గెలుపుపై అధికార పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కౌన్సిలర్‌గానే కాక ఆయన పురపాలక సంఘం చైర్మన్ పీఠం కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తు న్నారని పేర్కొంటు న్నారు. సౌమ్యుడు, వివాద రహితు డుగా పేరుగాంచిన సుంకరి రమేష్‌కు హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోనీ ప్రజలు, వ్యాపారస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజానీకంతో విస్తృత సంబంధాలు ఉన్నాయి. జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీని ప్రజల్లో ఉంచేందుకు విశేష కృషి చేస్తూ.. ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే జమ్మికుంట 17వ వార్డు మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచి..ప్రచారంలో ప్రజల ఆశీస్సులు కోరుతూ ముందుకెళు_న్నారు.సుంకరి రమేష్ కేవలం కౌన్సిలర్ పదవికే కాకుండా, భవిష్యత్తులో మున్సిపల్ చైర్మన్ పదవికి తగిన నాయకుడిగా ఉంటారని, రమేష్ మున్సిపల్ చైర్మన్ గా సుపరిపాలన అందిస్తారని పలువురు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

**నిబద్ధ కార్యకర్త**

కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ.. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన నిబద్ధ కార్యకర్త సుంకరి రమేష్, ఏండ్లుగా పార్టీలో కొనసాగుతూ.. 2000 సంవత్సరం నుంచి హస్తం పార్టీలో కార్యకర్తగా మొదలై.. నాయకుడిగా పార్టీలో ఎదిగి.. పార్టీకి విశేష సేవలు అందిస్తున్నారు. జననేత, దివంగత సీఎం డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో పాల్గొ న్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపి.. పార్టీని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్ని స్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి హెదాలో ప్రస్తుత సీఎం రేవంత్రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ వరిధిలో చేపట్టిన పాదయాత్రలో కీలకంగా వ్యవహరించారు. సహజ వనరులు ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో కాంగ్రెస్ నాయకుడు రమేశ్ క్రియాశీలకంగా వ్యవహరించారు.

శ్రేణులకు రమేశ్ ఆపన్న హస్తంకాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆపన్న హస్తంఅందిస్తూ.. సొంత డబ్బులతో కార్యక్రమాలను నిర్వహించడం లోనూ వెనకాడ లేదు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్ ఛార్జీ ప్రణవ్ వొడితల ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యక్రమాలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. పార్టీలో విభేదా లకు తావు లేకుండా అందరినీ ఏకతాటిపైకి నడిపించేందుకు తన వంతుగా రమేశ్ కృషి చేస్తున్నారు.

**అధికార పార్టీ అండదండలతో..**

వార్డు స్థాయిలోనే కాకుండా, మున్సిపాలిటీ మొత్తాన్ని అభివృద్ధి చేసే దృష్టి ఉన్న నాయకుడిగా ఆయనకు గుర్తింపు లభిస్తోంది. అందుకే ఈసారి 17వ వార్డు ప్రజలు ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి, కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ కౌన్సిలర్‌గా మాత్రమే కాకుండా చైర్మన్ పదవికి కూడా అర్హుడిగా నిలబెట్టాలని సుంకరి రమేష్ అనుచర వర్గీయులు కోరుకుంటున్నారు.కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పారదర్శకత, ప్రజాస్వామ్యం, సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారు. అందుకే ఈసారి 17వ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరవేసి, సుంకరి రమేష్‌ను గెలిపించి మున్సిపాలిటీకి సమర్థవంతమైన చైర్మన్‌ను అందించాలనే సంకల్పంతో సుంకరి అనుచరులు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073